www.aksharadarbar.com
సోమవారం 18, మార్చి 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంచిక :42 | సంపుటి :02 | పేజీలు : 04 | వెల : 05

రూ.5.73 కోట్ల బంగారం పట్టివేత

వాహనాల తనిఖీల్లో బయటపడిన అక్రమ రవాణా

అక్షర దర్బార్, నల్గొండ: నల్గొండ జిల్లా మిర్యాలగూడ వద్ద వాహనాల తనిఖీలో బంగారం పట్టుబడింది. అక్రమంగా రవాణా జరుగుతున్న బంగారం విలువ రూ.5.73 కోట్లు ఉంటుందని అంచనా.. పార్లమెంటు ఎన్నికలకు షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో అధికారులు తనిఖీలు ముమ్మరంగా చేపట్టారు. ఈ నేపథ్యంలో మిర్యాలగూడ వద్ద సోమవారం పోలీసులు తనిఖీలు నిర్వహించగా, మిర్యాలగూడ నుంచి కోదాడ వైపు వెళ్తున్న బొలెరో వాహనంలో బంగారం రవాణా జరుగుతున్నట్లు గుర్తించారు. రూ.5.73 కోట్ల విలువైన బంగారం స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు నల్గొండ జిల్లా ఎస్పీ చందన దీప్తి వెల్లడించారు. ఈ ఘటనపై విచారణ జరుగుతున్నట్లు ఆమె తెలిపారు.

- నేడు రెండో జాబితా విడుదల చేయనున్న కాంగ్రెస్
- వరంగల్ పార్లమెంట్ స్థానంపై హస్తం పార్టీలో ఉత్కంఠ
- దొమ్మటి సాంబయ్య వైపు అధిష్ఠానం మొగ్గు
- బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులపై స్పష్టత

2లో

ఉత్కంఠ..!

తుది దశకు ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థుల ఖరారు

పార్లమెంటు ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేయడంతో ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థులను ఖరారు ప్రక్రియను పూర్తి చేయడంపై దృష్టి సారించాయి. సాధ్యమైనంత త్వరలో అన్ని లోక్ సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించటంపై ఫోకస్ పెట్టాయి. తెలంగాణలోని 17 పార్లమెంటు నియోజకవర్గాల్లో బీజేపీ ఇప్పటికే 15 స్థానాలకు తమ పార్టీ అభ్యర్థులను ప్రకటించి అభ్యర్థుల ఖరారులో ముందంజలో ఉంది. వరంగల్, ఖమ్మం స్థానాలకు మాత్రమే ఆ పార్టీ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. తాజాగా బీఆర్ఎస్ ను వీడి బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ను నేడో రేపో వరంగల్ నుంచి అభ్యర్థిగా కమలం పార్టీ ప్రకటించనుందని తెలుస్తుంది. అభ్యర్థులను ఖరారు చేయడంలో రాష్ట్రంలో బీజేపీ తర్వాత స్థానంలో బీఆర్ఎస్ ఉంది. బీఆర్ఎస్ అభ్యర్థుల ఖరారు చివరి దశకు చేరింది. మరి కొన్ని స్థానాల్లో మాత్రమే అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్, మహబూబాబాద్ పార్లమెంటు స్థానాల నుంచి తమ పార్టీ అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించింది. వరంగల్ నుంచి కడియం కావ్య, మహబూబాబాద్ నుంచి సిట్టింగ్ ఎం పీ మాలోతు కవిత బీఆర్ఎస్ అభ్యర్థులుగా బరిలో దిగారు. ఇక అభ్యర్థుల ఖరారులో కాంగ్రెస్ కొంత వెనుకబడి ఉందనే చెప్పవచ్చు. తెలంగాణలోని 17 పార్లమెంటు స్థానాల్లో ఇప్పటివరకు నాలుగింటిలో మాత్రమే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. నాగర్ కర్నూల్, జహీరాబాద్, నల్గొండ, మహబూబ్ నగర్ ఈ నాలుగు స్థానాల్లో ఉన్నాయి. ఎన్నికల షెడ్యూల్ శనివారం వెలువడిన దృష్ట్యా మిగిలిన 13 పార్లమెంటు స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసే పనిలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఉంది.

—అక్షర దర్బార్, వరంగల్ ప్రధాన ప్రతినిధి

రేవంత్.. వార్నింగ్ ఇవ్వకు..

వివరాలు 2వ పేజీలో..

నేనూ పాలమూరు బిడ్డనే..

- బీఆర్ఎస్ లో చేరిన ప్రవీణ్ కుమార్
- తెలంగాణ పునర్నిర్మాణం కోసమేనని వెల్లడి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు తానూ పాలమూరు బిడ్డనేనని... తనకు వార్నింగులు ఇవ్వడం మానుకోవాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అంతకు ముందు తెలంగాణ భవన్ కు వచ్చిన ఆర్ఎస్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో కేసీఆర్ అధికారంలో లేకపోవడం దురదృష్టకరమన్నారు. తెలంగాణ పునర్నిర్మాణం కోసం మాత్రమే తాను బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్తున్నానని పేర్కొన్నారు.

— అక్షర దర్బార్, హైదరాబాద్

పదేళ్లుగా దోచుకున్న బీఆర్ఎస్..

- తెలంగాణను ఏటీఎంగా మార్చుకున్న కాంగ్రెస్
- జగిత్యాల సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ

4



గవర్నర్ తమిళిసై రాజీనామా..

ఎన్నికల బరిలో దిగేందుకు నిర్ణయం

వివరాలు 4వ పేజీలో..

ఆప్ నేతలతో కలిసి కవిత స్కాం

- ఈడీ ప్రకటన విడుదల
- సుప్రీంలో కవిత తరుపున లాయర్ పిటిషన్

వివరాలు 2వ పేజీలో..

టెన్షన్.. టెన్షన్..!

- తుది దశకు ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థుల ఖరారు
- నేడు రెండో జాబితా విడుదల చేయనున్న కాంగ్రెస్
- వరంగల్ పార్లమెంట్ స్థానంపై హస్తం పార్టీలో ఉత్కంఠ
- దొమ్మటి సాంబయ్య వైపు అధిష్టానం మొగ్గు
- బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులపై స్పష్టత

అక్షర దర్బార్, వరంగల్ ప్రధాన ప్రతినిధి:

పార్లమెంటు ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేయడంతో ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థులను ఖరారు ప్రక్రియను పూర్తి చేయడంపై దృష్టి సారించాయి. సాధ్యమైనంత త్వరలో అన్ని లోక్ సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించటంపై ఫోకస్ పెట్టాయి. తెలంగాణలో గల 17 పార్లమెంటు నియోజకవర్గాల్లో బీజేపీ ఇప్పటికే 15 స్థానాలకు తమ పార్టీ అభ్యర్థులను ప్రకటించి అభ్యర్థుల ఖరారులో ముందంజలో ఉంది. వరంగల్, ఖమ్మం స్థానాలకు మాత్రమే ఆ పార్టీ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. తాజాగా బీఆర్ఎస్ ను వీడి బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ను నేడో రేపో వరంగల్ నుంచి అభ్యర్థిగా కమలం పార్టీ ప్రకటించనుందని తెలుస్తుంది. అభ్యర్థులను ఖరారు చేయడంలో రాష్ట్రంలో బీజేపీ తర్వాత స్థానంలో బీఆర్ఎస్ ఉంది. బీఆర్ఎస్ అభ్యర్థుల ఖరారు దశకు చేరింది. మరో కొన్ని స్థానాల్లో మాత్రమే అభ్యర్థులను బీఆర్ఎస్ ఖరారు చేయాల్సి ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్, మహబూబాద్ పార్లమెంటు స్థానాల నుంచి తమ పార్టీ అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించింది. వరంగల్ నుంచి కడియం కావ్య, మహబూబాబాద్ నుంచి సిట్టింగ్ ఎంపీ మాలోతు కవిత బీఆర్ఎస్ అభ్యర్థులుగా బరిలో దిగారు. ఇక అభ్యర్థుల ఖరారులో కాంగ్రెస్ కొంత వెనుకబడి ఉందనే చెప్పవచ్చు. తెలంగాణలోని 17 పార్లమెంటు స్థానాల్లో ఇప్పటివరకు నాలుగింటిలో మాత్రమే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. నాగర్ కర్నూల్, జహీరాబాద్, నల్గొండ, మహబూబ్ నగర్ ఈ నాలుగు స్థానాల్లో ఉన్నాయి. ఎన్నికల షెడ్యూల్ శనివారం వెలువడిన దృష్ట్యా మిగిలిన 13 పార్లమెంటు స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసే పనిలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఉంది.

సర్వత్రా ఉత్కంఠ

కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మంగళవారం తెలంగాణలో మిగిలిన 13 పార్లమెంటు స్థానాల నుంచి తమ పార్టీ అభ్యర్థుల రెండో జాబితాను విడుదల చేయనుందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం ఢిల్లీలో అఖిల భారత కాంగ్రెస్ పార్టీలోని కీలకమైన సెంట్రల్ స్క్రీనింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముందే రాష్ట్ర ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు ఏ రేవంత్ రెడ్డి ఢిల్లీ చేరుకున్నారు. పార్టీ అధినేత్రి సోనియాగాంధీని కలిసిన ఆయన రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులను వివరించారు. ఈ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహంపై మాట్లాడారు. అనంతరం ఏఐసీసీలోని ముఖ్య నేతలతో సీఎం రేవంత్ రెడ్డి అభ్యర్థుల ఖరారుపై చర్చించినట్లు తెలిసింది. కొన్ని స్థానాలపై పీఠముడి ఏర్పడినా 13 స్థానాల్లోనూ అభ్యర్థుల ఖరారుపై కొలిక్కి వచ్చినట్లు సమాచారం. మంగళవారం 13 స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అభ్యర్థుల పేర్లతో రెండో జాబితా విడుదల చేయనుందని తెలిసింది. దీంతో కాంగ్రెస్ పార్టీలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది

వరంగల్ స్థానంలో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రెండు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన తొలి జాబితాలోనే మహబూబాబాద్ లోక్ సభ స్థానం నుంచి పోరిక బలరాం నాయక్ కు అభ్యర్థిత్వం దక్కింది. వరంగల్ మిగిలిన 13 స్థానాల్లో ఉంది. ఇక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీ నేతలు పలువురు అభ్యర్థిత్వం రేసులో ఉన్నారు. ప్రధానంగా టిపిసిసి ఉపాధ్యక్షుడు దొమ్మటి సాంబయ్య, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్ ఘనపురం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన సింగపురం ఇందిర, వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశించి నిరాశ చెందిన నమిండ్ల శ్రీనివాస్ పేర్లు చివరకు అధిష్టాన వద్దకు చేరాయి. ఈ ముగ్గురిలో దొమ్మటి సాంబయ్య వైపు పార్టీ అధిష్టానం మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది. విముఖంగా ఉన్న నేతలకు నచ్చజెప్పి ఇక్కడి నుంచి దొమ్మటి సాంబయ్యను అభ్యర్థిగా ఖరారు చేసే పనిలో అదిష్టానం ఉన్నట్లు సమాచారం. మంగళవారం పార్టీ అధిష్టానం ప్రకటించే రెండో జాబితాలో వరంగల్ నుంచి దొమ్మటి సాంబయ్య పేరు ఉండే అవకాశం ఉందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. తనకే టికెట్ దక్కనుందని సాంబయ్య విశ్వసిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో పర్యటిస్తున్నారు. పార్టీ నేతలు, క్యాడర్ ను కలిసి మద్దతు కోరుతున్నారు ఈ నేపథ్యంలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల రెండో జాబితాపై టెన్షన్ నెలకొంది.

ఆప్ నేతలతో కలిసి

కవిత స్కాం..

- ఈడీ ప్రకటన విడుదల
- సుప్రీం కోర్టులో కవిత తరుపున లాయర్ పిటిషన్

అక్షర దర్బార్, హైదరాబాద్: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ సోమవారం ప్రెస్నోట్ విడుదల చేసింది. ఇప్పటి వరకు ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై, ముంబయి సహా 245 ప్రాంతాల్లో సోదాలు చేసినట్లు పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటి వరకు 15 మందిని అరెస్టు చేశామన్న ఈడీ, రూ.128.79 కోట్ల నగదు సీజ్ చేశామని ప్రెస్నోటులో పేర్కొన్నది. సిసోడియా, సంజయ్సింగ్, విజయ్నాయర్సహా 15 మందిని అరెస్టు చేశామన్న ఈడీ, హైదరాబాద్లోని కల్వకుంట్ల కవిత ఇంట్లో ఈ నెల 15న సోదాలు చేసినట్లు వెల్లడించింది. సోదాల సమయంలో కవిత బంధువులు ఆటంకం కలిగించారని తెలిపింది. కాగా, ఆప్ నేతలతో కలిసి కవిత అక్రమాలకు పాల్పడినట్లు తమ దర్యాప్తులో తేలిందని ఈడీ పేర్కొంది. ఆప్ నేతలతో కలిసి కవిత ఢిల్లీ మద్యం కుంభకోణానికి తెరలేపారన్న ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్, ఆమ్ ఆద్మీ పార్టీకి కవిత రూ.100 కోట్లు చెల్లించారని పేర్కొంది. కేజ్రీవాల్, సిసోడియాతో కలిసి కవిత కుట్ర పన్నారన్న అధికారులు, 2021-22 ఏడాదిలో మద్యం కుంభకోణానికి పాల్పడ్డారని వెల్లడించారు. మద్యం పాలసీని నిబంధనలకు విరుద్ధంగా రూపొందించారని, హోల్సేల్డీలర్ల నుంచి వచ్చిన డబ్బును వాటాలుగా పంచుకున్నారని తెలిపారు. ఒక నేరాభియోగ పత్రం, 5 అనుబంధ పత్రాలు దాఖలు చేసినట్లు స్పష్టం చేశారు.

సుప్రీం కోర్టులో పిటిషన్

ఈ నెల 15న అరెస్టయి ఈడీ అధికారుల కస్టడీలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఈ కేసులో తాజాగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సర్వోన్నత న్యాయస్థానంలో కేసు విచారణ జరుగుతుండగానే, తనను అరెస్ట్ చేశారని పిటిషన్ దాఖలు చేశారు. గతంలో విచారణ సందర్భంగా సమన్లు జారీ చేయబోమని కోర్టుకు చెప్పి, తనను అక్రమంగా అరెస్టు చేశారని పిటిషన్ లో పేర్కొన్నారు. కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు భావించి, దర్యాప్తు సంస్థపై తగిన చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కవిత తరఫు న్యాయవాది సోమవారం ఆన్ లైన్లో సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

రేవంత్.. వార్నింగ్ ఇవ్వకు

నేనూ పాలమూరు బిడ్డనే..

- బీఆర్ఎస్ లో చేరిన ప్రవీణ్ కుమార్
- తెలంగాణ పునర్నిర్మాణం కోసమేనని వెల్లడి

అక్షర దర్బార్, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు తానూ పాలమూరు బిడ్డనేనని... తనకు వార్నింగులు ఇవ్వడం మానుకోవాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అంతకు ముందు తెలంగాణ భవన్ కు వచ్చిన ఆర్ఎస్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో కేసీఆర్ అధికారంలో లేకపోవడం దురదృష్టకరమన్నారు. తాను ఏదీ ఆశించి బీఆర్ఎస్ పార్టీలో చేరడం లేదని... తెలంగాణ పునర్నిర్మాణం కోసం తాను బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్తున్నానని పేర్కొన్నారు. తాను ఎక్కడ ఉన్నా బహుజనుల ప్రయోజనాల కోసం కృషి చేస్తానన్నారు. తన వెంట నడిచే అభిమానులకు ఆయన థ్యాంక్స్ చెప్పారు. తెలంగాణ వాదం... బహుజన వాదం రెండూ ఒకటే అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ స్వర్ణయుగంగా మారిందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో పని చేసే అవకాశం వచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు. తాను ప్రత్యేక పరిస్థితుల్లో బీఆర్ఎస్లో చేరుతున్నట్లు తెలిపారు. చితికిపోయిన తెలంగాణకు కేసీఆర్ విముక్తి కలిగించారన్నారు. గత పదేళ్లు తెలంగాణ స్వర్ణయుగమన్నారు. తనకు టీఎస్పీఎస్సీ ఆఫర్ ఇచ్చారని... కానీ దానిని తిరస్కరించానని చెప్పారు. ఎవరు ఎక్కడైనా పని చేసుకునే స్వేచ్ఛ ఉందన్నారు. రేవంత్ రెడ్డి, తాను పాలమూరు బిడ్డలమని.. ఆయన బెదిరింపులకు భయపడేది లేదన్నారు. మీరు గేట్లు తెరిస్తే అందులో చేరుతున్న గొర్రెల్లో తాను ఒకడిని కాదల్చుకోలేదని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు.

పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న రాణాప్రతాప్ రెడ్డి

బూత్ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి

బీజేపీ నర్సంపేట నియోజకవర్గ చేరికల కమిటీ చైర్మన్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి

అక్షర దర్బార్, నర్సంపేట: బీజేపీని బూత్ స్థాయిలో బలోపేతం చేయాలని ఆ పార్టీ నర్సంపేట నియోజకవర్గ చేరికల కమిటీ చైర్మన్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అన్నారు. సోమవారం నర్సంపేట పట్టణం రెండో డివిజన్ లో బూత్ లెవల్ సమావేశాన్ని నిర్వహించారు. కౌన్సిలర్ జుర్రు రాజు యాదవ్ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన నలభై కుటుంబాలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ప్రతి పేదవాడికి మోడీ సర్కార్ అందిస్తోందని అన్నారు. మోడీ పాలన తీరుతో విదేశాల్లో సైతం గుర్తింపు వచ్చిందని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ బీజేపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్కు భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు, పార్లమెంటు కన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరీ రేసు శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహా రాములు, పట్టణ ఇన్చార్జీ గుడిపుడి రాధాకృష్ణ, శ్రీరంగం సాగర్, పట్టణ ప్రధాన కార్యదర్శులు కొంపెల్లి రాజు, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు
బాధ్యతగా పని చేయాలి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య
- ఎన్నికల నిర్వహణపై సీపీ, కలెక్టర్లు, ఎస్పీలు, డీసీపీలతో సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య

అక్షర దర్బార్, వరంగల్: పార్లమెంట్ ఎన్నికలను నిష్పక్షపాతంగా, సజావుగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయం, బాధ్యతతో పని చేయాలని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, హన్మకొండ, జనగామ, భూపాలపల్లి, జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లు సిక్తా పట్నాయక్, షేక్ రిజ్వాన్ బాషా, భవేష్ మిశ్రా, భూపాలపల్లి ఎస్పీ కిరణ్ కుమార్, డీసీపీలతో కలిసి వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని స్టేషన్ ఘన్ పూర్, పాలకుర్తి, పరకాల, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, భూపాలపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ల ఏఆర్వోలు, ఉప ఎన్నికల జిల్లా అధికారులు, జిల్లాల ఎన్నికల నోడల్ అధికారులతో జరిగిన సమన్వయ సమావేశంలో ఆయా అసంబ్లీ సెగ్మెంట్లలో చేపట్టిన ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. ఏఆర్వోలు అశ్విని తానాజీ వాకడే, కే.శ్రీనివాస్, డీఎస్ వెంకన్న, రోహిత్ సింగ్, నారాయణ, వెంకటయ్య, మంగీలాల్, సీదం దత్తు, రాధిక గుప్తా, వై వి గణేష్, ఉప ఎన్నికల అధికారులు పీయూష్ కుమార్, సంధ్యారాణి, రాధిక గుప్తా, కే.వెంకటేశ్వర్లు, జిల్లా ఎన్నికల పోలీస్ నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి పి.ప్రావీణ్య మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ నియోజవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో మొత్తం 1899 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో 419 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించినట్లు తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సజావుగా పోలింగ్ ప్రక్రియ జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు రోజువారీ నివేదికలను ఏలాంటి తప్పులు దొర్లకుండా సకాలంలో పంపాలని సూచించారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించుటకు సమష్టిగా కృషి చేయాలి అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉన్న అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. వచ్చే 90 రోజులు అధికారులందరూ ఎన్నికల సంఘం పరిధిలో ఉంటారని, అధికారుల్లో ప్రతిభ ఉందని, ప్రతి అంశాన్ని అత్యంత జాగ్రత్తగా, నిబద్ధతతో వ్యవహరించాలన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో సమన్వయంతో పని చేయడం వల్ల విజయవంతంగా పూర్తి చేశామని, అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఏఆర్వోలు, ఏసీపీలు సమన్వయంతో నివేదికలు అందించాలన్నారు. భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ ఈసీఐ నిబంధనల ప్రకారం నియోజకవర్గంలో పోలింగ్ సాయంత్రం 4 గంటలకే పూర్తవుతుందని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ కోసం అధికారులకు విధులు కేటాయించామని, విధులు సమర్థవంతంగా నిర్వహించేందుకు అదనంగా డేటా ఎంట్రీ ఆపరేటర్లు నియమించుకోవాల్సి ఉందన్నారు. భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ ఎన్నికల వేళ ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు డబ్బు, మద్యం ఇతర సామాగ్రి పంచకుండా, అక్రమ రవాణా జరగకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో డీసీపీలు ఎంఏ బారి, రవీందర్, సీతారాం, ఏసీపీలు, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ ఎన్నికల పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి
నివారణకు పటిష్ట చర్యలు

ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

మాట్లాడుతున్న ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

అక్షర దర్బార్ , ములుగు : వేసవిలో గ్రామీణ ప్రజలకు త్రాగు నీటి ఎద్దడి రాకుండా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టర్ మంచినీటి సరఫరాపై క్షేత్రస్థాయిలో ఏటూరు నాగారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 3 నెలలపాటు నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని అన్నారు. తాగునీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని, ప్రత్యేకించి తాగునీటిని వృధా చేయవద్దని, ఇల్లు శుభ్రం చేసుకునేందుకు, ఇతర పనులకు తాగునీటిని వాడవద్దని, వీటికి ముడి నీటిని వాడాలని కోరారు. లీకేజీలు ఉన్న చోట వెంటనే అరికట్టాలని అధికారులను ఆదేశించారు. తాగునీటితో పాటు, శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. నీటి కొరతను దృష్టిలో ఉంచుకొని అందరూ బాధ్యతగా పనిచేయాలని కోరారు. అవసరం ఉన్న చోట హ్యాండ్ పంపులు, బోర్ వెల్స్ ద్వారా నీటిని అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.శ్రీజ, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేశం, డిప్యూటీ సీఈవో రమాదేవి, డీఈ నాగేశ్వర్ రావు, తహసీల్దార్, ఎంపీడీవో, ఇతర అధికారులు పాల్గొన్నారు

సమన్వయంతో పని చేస్తే అద్భుత ఫలితాలు

- హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్
- వ్యవసాయ పరిశోధనా, విస్తరణ సమావేశాలు ప్రారంభం

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

అక్షర దర్బార్, హనుమకొండ: వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు సమన్వయంతో పనిచేసినప్పుడే వ్యవసాయ రంగంలో అద్భుత ఫలితాలు సాధించవచ్చని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. హనుమకొండ జిల్లా ములుగు రోడ్డు సమీపంలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో మధ్య తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం రెండు రోజుల సమావేశాలను సోమవారం జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేయగా కలెక్టర్ వాటిని పరిశీలించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ రైతులు ఒకరి నుంచి ఒకరు పంటల సాగు విధానంలో అనుభవాలను తెలుసుకుంటూ అనువైన పద్ధతులను అవలంబించాలని సూచించారు. సమావేశంలో ఏడీఆర్ రావుల ఉమారెడ్డి 2022 -23 సీజన్లో పరిశోధన ఫలితాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వాతావరణ పరిస్థితులు, పంటల సాగు విస్తీర్ణం, వివిధ పంటల్లో చీడపీడలతో కలిగిన నష్టం, వృద్ధి చేసిన రకాలు, రాబోయే సీజన్లో విడుదల చేయబోయే రకాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.రఘురాం రెడ్డి, విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.సుధారాణి, జేడీఏ సుజాత, వరంగల్, హనుమకొండ జిల్లాల వ్యవసాయ శాఖ జేడీలు ఉషా దయాల్, రవీందర్ సింగ్, డీహెచ్ఎస్వో శ్రీనివాస్, వరంగల్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బలరాం, నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి. దిలీప్ కుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ మాలతి, ఆర్ఈఏసీ సభ్యులు రాణాప్రతాప్, మధ్య తెలంగాణలోని 11 జిల్లాల వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

పదేళ్లు దోచుకున్న బీఆర్ఎస్

- తెలంగాణను ఏటీఎంగా మార్చుకున్న కాంగ్రెస్
- జగిత్యాల సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ


బహిరంగ సభలో మాట్లాడుతున్న పీఎం మోడీ

అక్షర దర్బార్, జగిత్యాల : కాంగ్రెస్పార్టీ తెలంగాణ ఆశలను నాశనం చేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. పదేళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ రాష్ట్ర ప్రజలను దోచుకుందని, ఇప్పుడు హస్తం పార్టీ తెలంగాణను తమ ఏటీఎంగా మార్చు కుందని ఆరోపించారు. తెలంగాణ డబ్బు ఇప్పుడు ఢిల్లీ చేరుతోందన్న ఆయన, ఒక దోపిడీదారు, మరో దోపిడీదారుపై పోరాడలేరని ప్రజలకు తెలుస న్నారు. ఈ క్రమంలోనే భారత రాష్ట్ర సమితి అవినీ తిపై రేవంత్ సర్కార్ మౌనం వహిస్తోందన్న ప్రధాని, కాళేశ్వరం దోపిడీని కాంగ్రెస్ ప్రశ్నించడం మానేసిందన్నారు. సోమవారం జగిత్యాలలో ఏర్పాటు చేసిన బీజేపీ విజయ సంకల్ప సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా పాల్గొని కాంగ్రెస్, బీఆర్ఎస్లపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీఆర్ఎస్లు ఒకరినొకరు కాపాడుకుంటూ, బీజేపీని విమర్శిస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఆ రెండు పార్టీలు తనను విమర్శిం చడమే పనిగా పెట్టుకున్నాయన్నారు. తెలంగాణను దోచుకున్న వారిని విడిచిపెట్టేది లేదని, దోపిడీదారు లను వదిలిపెట్టమని హెచ్చరించారు. ఇది మోదీ గ్యారంటీ అని స్పష్టం చేశారు. కుటుంబ పార్టీలు దేశాన్ని దోచుకునేందుకే రాజకీయాలు చేస్తాయని ఆరోపించిన ఆయన, దేశంలో ఏ దోపిడీని పరిశీ లించినా దాని వెనక కుటుంబ పార్టీలే ఉన్నాయని స్పష్టం చేశారు. 2జీ స్పెక్ట్రమ్ స్కామ్లో డీఎంకే పేరు బయటకు వచ్చింది. అది కుటుంబ పార్టీనే. నేషనల్హె రాల్డ్ కేసులో కాంగ్రెస్సేరు బయటకు వచ్చింది.. అదీ కుటుంబ పార్టీనే. ఇప్పుడు ఆ జాబితాలో కుటుంబ పార్టీ బీఆర్ఎస్ చేరింది. కుటుంబ పార్టీ అయిన బీ ఆర్ఎస్ కాళేశ్వరంలో అవినీతి చేసింది. ఢిల్లీ మ ద్యం అంశంలోనూ బీఆర్ఎస్ అవినీతికి పా ల్పడింది. తెలంగాణలో బీజేపీని ఎంతగా గెలిపిస్తే, నేను అంతగా బలోపేతం అవుతానని ప్రధాని మోడీ అన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో పాటు బీజేపీ ముఖ్య నేతలు ఈ సభలో పాల్గొన్నారు.

గవర్నర్ తమిళిసై రాజీనామా..

ఎన్నికల బరిలో దిగేందుకు నిర్ణయం

అక్షర దర్బార్, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. గవర్నర్ పదవికి తమిళిసై సౌందర రాజన్ సోమవారం రాజీనామా చేశారు. రాష్ట్ర గవర్నర్ పదవితో పాటు అదనపు బాధ్యతల్లో ఉన్న పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ పదవికీ రాజీనామా చేశారు. రానున్న లోక్సభ ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసేందుకు వీలుగా తమిళిసై రాజీనామా చేసినట్లు సమాచారం. ఈ మేరకు రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సోమవారం ఉదయం గవర్నర్ మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. అనంతరం రాజీనామాపై నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

2019 సెప్టెంబర్ నుంచి..

తమిళనాడుకు చెందిన తమిళిసై సౌందర రాజన్, 2019 సెప్టెంబర్ 8న రాష్ట్రానికి గవర్నర్గా వచ్చారు. అప్పటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాఘవేంద్ర సింగ్ చౌహాన్ ఆమెతో రాష్ట్ర గవర్నర్గా ప్రమాణ స్వీకారం చేయించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రెండో గవర్నర్గా తమిళిసై బాధ్యతలు స్వీకరించారు. ఆమె ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అప్పటి సీఎం కేసీఆర్, మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు. త మిళనాడు ప్రభుత్వం తరఫున ఆ రాష్ట్రానికి చెందిన అప్పటి ఉప ము ఖ్యమంత్రి పన్నీర్ సెల్వం కూడా హాజరయ్యారు. అనంతరం 2021 ఫిబ్రవరి 18 నుంచి పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ గానూ అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గతంలో తమిళనాడు బీజేపీ అధ్యక్షురా లిగా పని చేసిన తమిళిసై, 2019లో తూత్తుకుడి నుంచి లోక్ సభకు పోటీ చేసి కరుణానిధి కుమార్తె కనిమొళిపై ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత తెలంగాణ గవర్నర్గా నియమితులయ్యారు.

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా బెజ్జంకి పూర్ణ చారి

అక్షర దర్బార్, పరకాల : బీజేపీ ఓబీసీ మోర్చా హన్మకొండ జిల్లా అధ్యక్షుడిగా పరకాల పట్టణా నికి చెందిన 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణ చారిని నియమించినట్లు జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, తన ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షు రాలు రావు పద్మ, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, నాంపల్లి శ్రీనివాస్, నాయకులకు, కార్యకర్తలకు బెజ్జంకి పూర్ణచారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ అభి వృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

రెండు ఇసుక లారీల పట్టివేత

అక్షర దర్బార్, మల్హర్ : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు కొయ్యూరు ఎస్సై వడ్లకొండ నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీలను సీజ్ చేసి, డ్రైవర్, వెహికల్ యజమాని మీద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా తాడిచర్ల, మల్లారం ప్రధాన రహదారిపై అనుమతి లేకుండా పోసిన ఇసుక కుప్పలను తహసీల్దారుకు అప్పగించినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పట్టుబడిన ఇసుక లారీ

మానవత్వం చాటుకున్న మట్టెవాడ పోలీసులు..

అక్షర దర్బార్, వరంగల్ : పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో రామన్నపేటకు చెందిన పదో తరగతి విద్యార్థిని సిలువేరు హనీ పరీక్ష రాసేందుకు బ్యాంకు కాలనీలోని ఎస్సార్ హై స్కూల్ సెంటరుకు చేరుకున్నది. కాగా, తాను చేరుకున్న పరీక్షా కేంద్రం సరైనది కాదని గుర్తించి ఆందోళన చెందుతుండడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న మట్టెవాడ పోలీసులు విద్యార్థిని హాల్ టికెట్ ను పరి శీలించారు. పరీక్ష సమయానికి ఇంకా 5 నిమిషాలు మాత్రమే ఉండడంతో హుటాహుటీన సీఐ తన వాహనంలో పోతక్ మహల్ లోని ఎస్సార్ హైస్కూల్ కేంద్రానికి తీసుకెళ్లాడు. చివరి నిమిషంలో భావోద్వేగా నికి గురైన విద్యార్థినికి ధైర్యం చెప్పి పరీక్ష కేంద్రంలోకి పంపించాడు. కాగా, సకాలంలో స్పందించిన సీఐ సమయస్ఫూర్తికి తల్లిదండ్రులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పరీక్ష కేంద్రంలోకి విద్యార్థినిని పంపిస్తున్న సీఐ

కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా రెడీ..!

- రేపు ప్రకటించనున్న కాంగ్రెస్ సెంట్రల్ కమిటీ
- గెలుపు గుర్రాలకే టికెట్..

అక్షర దర్బార్, వరంగల్ ప్రధాన ప్రతినిధి : కాంగ్రెస్ జాబితా రెడీ అయ్యింది. అభ్యర్థుల లిస్టును మంగళవారం కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ ప్రకటిం చేందుకు రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేసింది. ఇందులో భాగంగా సోమవారం మరోసారి కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశమైంది. ఇప్పటి వరకు కాంగ్రెస్ కేవలం నలుగురు అభ్యర్థు లను మాత్రమే ప్రకటించింది. బీఆర్ఎస్ కూడా తమ అభ్యర్థులను ప్రకటించి ప్రచార పర్వానికి తెరతీసింది. బీజేపీ కూడా 17 స్థానాలకు 15 మంది అభ్యర్థు లను ప్రకటించి ప్రచారం చేస్తోంది. రాష్ట్రంలో బీజేపీ అగ్రనేతలు సైతం రోడ్డు షోలు, బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. అయితే, కాంగ్రెస్ మాత్రం మంగళ వారం అభ్యర్థులను ప్రకటించి ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నది. అయితే, ఢిల్లీలో కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశం సాయంత్రం జరుగగా, సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి, హాజరయ్యారు. 13 స్థానాలకు మంగళ వారం అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం బీఆర్ఎస్ నుంచి పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరుతుం డగా.. వారిలో బలమైన నాయకులను పోటీ చేయించేలా కాంగ్రెస్ వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది..

గెలుపు గుర్రాలకే టికెట్..

రాష్ట్రంలో విజయోత్సాహంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ లోక్ సభ ఎన్నికల్లోనూ మెజార్టీ స్థానాలను గెలుచుకోవాలని పట్టుదలతో ఉన్నది. ఈ మేరకు నియోజక వర్గాల వారీగా సర్వేలు చేసింది. గెలుపు గుర్రాలకే టికెట్ కేటాయించేలా కసరత్తు చేస్తున్నది. అందులో భాగంగానే చేరికల పర్వానికి తెరతీసిందని సమాచారం. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా అభ్యర్థి బలాబలాలు ఏంటి..? ప్లస్, మైనసులు ఏమిటి అనేదానిపై సర్వే చేసింది. వీటి ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తున్నట్లు సమాచారం. అయితే, గత రెండు, మూడు రోజులుగా కాంగ్రెస్ పార్టీలోకి జోరుగా చేరికలు జరుగుతున్నాయి. కొత్తగా పార్టీలోకి వచ్చే వారికి టికెట్లు దక్కే అవకాశం ఉండటంతో కాంగ్రెస్ అభ్యర్థిత్వం ఆశిస్తున్న వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది.